సాక్షి నిజామాబాద్

శుక్రవారం : 25 : ఆగస్టు : 2023



మాగోడు పట్టదా?

వేతనాలు అందక వీవోఏలు ఇబ్బందులు పడుతున్నారు. జనవరి నుంచి జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸



జోరుగా ఇసుక రవాణా

మోర్తాడ్‌లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. మొండివాగు, పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.9 /24.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సర్వే,ల్యాండ్ రికార్డ్స్ ఏడీపై ఏసీబీ కేసు

ఖలీల్‌వాడి : జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ పోతంశెట్టి శ్యాంసుందర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ ప్రసన్నరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చ్ 28న మోర్తాడ్ మండలంలోని ధర్మోరాకు చెందిన రాజేందర్ కోళ్లఫారం కోసం వ్యవసాయభూమిని నాలా కన్వర్షన్ చేయడానికి రూ.10 వేల లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని శ్యాంసుందర్ ఇంటిలో ఏసీబీ సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. శ్యాంసుందర్ ఇళ్లలో రూ.78 లక్షల 2 వేల 700 నగదు, 144 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా పలు బ్యాంక్ అకౌంట్లల్లో రూ.30 లక్షల క్యాష్ ఉన్నట్లు తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిట్స్, పోస్ట్ ఆఫీస్ డిపాజిట్స్ రూపంలో రూ.కోటి 38 లక్షల 91 వేలు ఉన్నట్లు చెప్పారు. ఇవి కాకుండా అదనంగా రూ. 96.97లక్షల విలువైన ఆస్తులు ఉన్నట్లు చెప్పారు. శ్యాం సుందర్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఇంకా సోదాలు కొనసాగుతున్నట్లు సమాచారం.

గాంధీ చలన చిత్రాన్ని వీక్షించిన విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో మహాత్మా గాంధీ చలన చిత్రాన్ని 17,173 మంది విద్యార్థిని, విద్యార్థులు వీక్షించారని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 24 వరకు జిల్లాలోని 9 సినిమా థియేటర్లు, నిజామాబాద్‌లోని విజయ్ థియేటర్, ఉషా ప్రసాద్ స్క్రీన్-3, లాలితామహల్, నటరాజ్, దేవి థియేటర్, నందిపేటలోని కృష్ణ థియేటర్, ధర్పల్లిలోని శ్రీ వేంకటేశ్వర థియేటర్, ఆర్మూర్‌లోని పీవీఆర్ మల్టీప్లెక్స్, భీమ్‌గల్‌లోని సుదర్శన్ థియేటర్‌లలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1-30 గంటల వరకు గాంధీ చలన చిత్రాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యారులు తిలకించారని తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ నాగారం : జిల్లా క్షయ నివారణ సంస్థ, భవ్య హెల్త్ ప్రైవేట్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం టీబీ రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పోస్టర్లను ప్రైవేట్ ఆస్పత్రులలో గోడలకు అతికించడం వల్ల అక్కడి వచ్చే రోగులకు ప్రభుత్వ హాస్పిటల్‌లో కల్పించే సదుపాయల గురించి తెలిసే అవకాశం ఉంటుందన్నారు. టీబీ బాధితులకు న్యూట్రీషియన్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, డీపీఎం సుధాకర్, సూర్య హెల్త్ ఆర్గనైజషన్ విజయనందరావు, రాజేంద్ర, భవ్య హెల్త్ సర్వీసెస్ బాబు, డీపీపీఎం నరేష్, సంతోష్, కృష్ణ, దత్తు, వినోద్ ప్రశాంత్, శ్యామల పాల్గొన్నారు.

నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో పువ్వుల దుకాణాల వద్ద సందడి



నగరంలో అరటి పండ్లు విక్రయం



ఫలం.. పుష్పం.. మరింత పిరం

చామంతి పువ్వులు కిలో రూ.400, బంతి పువ్వులు కిలో రూ.360, గులాబీ పువ్వులు కిలో రూ.400. ఇవి నిజామాబాద్ నగరంలో పలుకుతున్న పువ్వుల ధరలు. సాధారణ రోజుల్లో వీటి ధర ఇందులో మూడోవంతు కూడా ఉండదు. ఇక అరటి పండ్లు సైతం డజను రూ.60 పలుకుతున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే అరటి పండ్ల ధర రెట్టింపైంది. నేడు శ్రావణ శుక్రవారం కావడం, వరలక్ష్మి వ్రతం ఉండడంతో మహిళలు పూజల కోసం పుష్పాలు కొనేందుకు భారీగా పోటెత్తారు. దీంతో వ్యాపారులు ధరలను భారీగా పెంచారు. మహిళలు ఈ ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బాధ్యతాయుతంగా పని చేయాలి

జేపీఎస్‌లకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు అందించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి



జేపీఎస్‌లతో ఎమ్మెల్యే బాజిరెడ్డి, డీపీవో జయసుధ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం డీపీవో జయసుధతో కలిసి బాజిరెడ్డి గోవర్ధన్ డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, నిజామాబాద్ రూరల్, మోపాల్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన 79 మంది జూనియర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీలకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వుల కాపీలు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పని చేస్తూ ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం జేపీఎస్‌ల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వ ఉ ద్యోగులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో జేపీఎస్‌ల పనితీరును లెక్కించి 70 శాతం మార్కులు సాధించిన వారికి నేడు తొలివిడతగా రెగ్యులరైజేషన్ ఆర్డర్స్ అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు.

కార్యక్రమంలో ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, డీఎల్‌పీవో నాగరాజు, డిచ్‌పల్లి ఎంపీడీవో గోపిబాబు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనుమతి అక్కర లేదా!

- ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం
- ఓ వైపు సీజ్.. మరో వైపు తరగతుల కొనసాగింపు
- కరువైన విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ

విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలు కొన్ని అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో సుమారు 20 వరకు ప్రైవేటు పాఠశాలలకు అనుమతి లేదు. అదేవిధంగా ఇతర పాఠశాలల రిజిస్ట్రేషన్ మీద పదో తరగతి నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలు సుమారు 50 పైబడి ఉన్నాయి. వీటిపట్ల విద్యాశాఖ సంవత్సరాల తరబడి దృష్టి సారించడం లేదు. వాస్తవానికి 10వ తరగతి వరకు సంబంధిత పాఠశాలకు గుర్తింపు ఉంటేనే అనుమతి ఇవ్వాలి. ఇలా కాకుండానే ప్రతి ఏటా కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను ఇతర ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ పేరుతో పరీక్షలు రాయిస్తున్నాయి. ఫీజులు మాత్రం భారీగా దండుకుంటున్నారు. – నిజామాబాద్ అర్బన్

■ జిల్లా కేంద్రంలోని హైమద్‌పూర కాలనీలో ప్రధాన రోడ్డు మీద ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల ఏడు సంవత్సరాలుగా 6 నుంచి 10వ తరగతి వరకు అనుమతి లేకుండా కొనసాగుతోంది. సారంగాపూర్ వద్ద ఉన్న మరో ప్రైవేటు పాఠశాల పేరుమీద విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుని కొనసాగిస్తున్నారు.

■ మాలపల్లి ప్రాంతంలో ఉన్న ప్రైవేటు పాఠశాల ఎనిమిది సంవత్సరాలుగా 8 నుంచి 10వ తరగతి వరకు అనుమతి లేకుండానే కొనసాగుతోంది.

■ హైమద్ పుర కాలనీలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాల నెలకొల్పారు. దీనికి అనుమతి లేదు. వినాయక నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల పాఠశాల 8 ,9 ,10 తరగతులకు అనుమతి లేకుండానే కొనసాగడంతో విద్యాశాఖ అధికారులు ఇటీవల రెండు సార్లు సీజ్ చేశారు. అయినా పాఠశాల తరగతులు మాత్రం నిర్వహిస్తున్నారు. విద్యార్థి సంఘాలు సైతం ఇక్కడికి వెళ్లి తరగతులను బహిష్కరించాయి.



ఇటీవల వినాయక్ నగర్‌లో విద్యాశాఖ అధికారులు సీజ్ చేసిన పాఠశాల తరగతి గది

■ హౌసింగ్ బోర్డు కాలనీలోని మరో రెండు పాఠశాలలు అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయి.

■ భీమ్‌గల్‌లోని ఓ పాఠశాల ఆరేళ్లుగా అనుమతి లేకుండానే ఉన్నత స్థాయి తరగతులు నిర్వహిస్తోంది. ఆర్మూర్‌లో నాలుగు ప్రైవేటు పాఠశాలలు ఉన్నత తరగతులకు అనుమతి లేకుండానే ఇతర పాఠశాలలపై కొనసాగుతున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలలు అనుమతిలేకుండా కొనసాగుతున్నా విద్యాశాఖ దృష్టి సారించడం లేదు.

ఎమ్మెల్యే పీఏ ఒత్తిడితో..

నగరంలోని గంగస్థాన్‌లో కొనసాగుతున్న ఓ ప్రైవేటు పాఠశాల ఏమాత్రం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లేదు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన అనుమతులు కూడా లేవు. ఈ పాఠశాల అనుమతి కోసం ఓ ఎమ్మెల్యే పీఏ ఒత్తిడి చేయడంతో మండల విద్యాశాఖ అధికారి ఫైల్‌ను జిల్లా విద్యాశాఖకు పంపించారు. ఈ విషయాన్ని ఎంఈవోనే స్వయంగా చెప్పడం గమనార్హం.

ఏజెంట్‌గా మారిన రిటైర్డు టీచర్

ఓ ప్రభుత్వ రిటైర్డ్ టీచర్ విద్యా శాఖలో ప్రైవేటు పాఠశాలలకు ఏజెంట్‌గా మారాడని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా బోధన్ రోడ్డు ప్రాంతంలోని పలు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పనులన్నీ విద్యాశాఖతో కలిసి చక్కబెడుతున్నాడని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం లేని పాఠశాలలకు అనుమతులు ఇప్పించడంలో దిట్ట అని చెబుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో పాఠశాల నుంచి రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం..



అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేస్తాం. పాఠశాలలు కనీస నిబంధనలు పాటించాలి లేదంటే చర్యలు తప్పవు. ఇటీవల అనుమతి లేని కొన్ని పాఠశాలలకు నోటీసులు ఇచ్చాము. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

–దుర్గాప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి

నోటీసులు ఇచ్చినా..



విద్యాశాఖ అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. ఇటీవల జిల్లాలో అనుమతిలేని పాఠశాలలు పెరిగిపోతున్నాయి. విద్యాశాఖ నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. విద్యాశాఖలో కొందరి అవినీతి వల్ల ప్రైవేటు పాఠశాలు రాజ్యమేలుతున్నాయి.

–లాల్‌సింగ్, టీపీయూఏ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు

పాలిటెక్నిక్, సీఎంసీ భవనాల పరిశీలన



డిచ్‌పల్లి సీఎంసీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలు, డిచ్‌పల్లిలోని సీఎంసీ మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించారు. త్వరలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలు ఏవీ అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాల గురించి తనవెంట ఉన్న అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, డీసీపీ జయరాం తదితరులతో చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులతో కూడిన భవన సముదాయాన్ని గుర్తించి ఎన్నికల సంఘానికి వివరాలు పంపిస్తామని కలెక్టర్ అన్నారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న మరికొన్ని కళాశాలలు, ఇతర కార్యాలయాల భవనాలను పరిశీలించి తనకు పూర్తి వివరాలు తెలియజేయాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్‌ను ఆదేశించారు.

ఖిల్లా ప్రభుత్వ పాఠశాల..

జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. ఒకే ప్రాంగణంలో మూడు పాఠశాలలు కొనసాగుతుండడంతో తరగతి గదుల కొరత నెలకొని ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే మన ఊరు – మన బడి కింద మంజూరైన పనులకు సంబంధించి ప్రస్తుతం అవి ఏ దశలో కొనసాగుతున్నాయన్నది పరిశీలించారు. నీటి కొరత ఉందని ఉపాధ్యాయులు తెలుపగా, బోరు బావిని మరమ్మతులు చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తిస్తూ, అదనపు గదుల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు ఉన్నారు.

అధికార దుర్వినియోగం

- సొంత పొలంలో ప్రభుత్వ సొమ్ముతో పనులు
- స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ మార్పించే ప్రయత్నం
- విద్యుత్ డీఈపై సీఎండీకి ఫిర్యాదు చేసిన రైతులు

నిజామాబాద్ నాగారం : విద్యుత్ శాఖలో ఓ డీఈ తీరు వివాదాస్పదంగా మారింది. చివరికి రైతులు ఎదురు తిరిగే వరకు వచ్చింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం .. నిజామాబాద్ విద్యుత్ డివిజన్ మాక్లూర్ మండలం ఏఈ పరిధి చిన్నాపూర్ గ్రామంలో ఆర్మూర్ డీఈ హరిచంద్ నాయక్‌కు ఆరెకరాల వ్యవసాయభూమి ఉంది. బోరుబావులు మూడు ఉన్నాయి. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ దూరంగా ఉండడంతో మార్చడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. మాక్లూర్ ఏఈపై ఒత్తిడి పెంచి రూ. 2 లక్షల విలువ చేసే పనులను చేయించడానికి ఎస్టిమేషన్ తయారు చేయించారు. అయితే ఎస్టిమేషన్ వేయకన్నా ముందే ఆర్మూర్ డివిజన్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌తో నాలుగు స్తంభాలు వేయించారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ చేయించడానికి రంగం సిద్ధం చేశారు. తన పొలం చుట్టుపక్కల ఉన్న రైతులు ఎదురు చెప్పడంతో సదరు డీఈకి చుక్కలు కనిపించాయి. రైతులను డీఈ ఇబ్బందులకు గురి చేయడంతో వారు ఈ నెల 6న రాత పూర్వకంగా సీఎండీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో డీఈ గతంలో ట్రాన్స్‌ఫార్మర్ వేయిస్తానని ఒక్కో రైతు నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేశారని, రైతులను వేధించి అక్రమంగా ఆర్జించిన డబ్బుతో 30 ఎకరాల వరకు పొలం కొన్నట్లు ఆరోపించారు.

ఏపీటీఎస్ విచారణ..

సీఎండీ ఆదేశాలతో వారం రోజుల క్రితం ఏపీటీఎస్ పోలీసులు డీఈ హరిచంద్‌నాయక్‌పై విచారణ జరిపారు. అయితే విచారణను 'మమ' అనిపించారని విమర్శలు వస్తున్నాయి. ఓ మంత్రి పీఏతో ఏపీటీఎస్ పోలీసులకు ఫోన్‌లు చేయించి విచారణ ఆపేయించారని శాఖలో బహిరంగంగా చెప్పుకుంటున్నారు.



మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్‌లో డీఈ హరిచంద్‌నాయక్ పొలంలో వేసిన కొత్త స్తంభాలు

క్లుప్తంగా

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. ఉదయం నిర్వహించిన పీజీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 1668 మంది విద్యార్థులకు 1566 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన బీఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 39 మంది విద్యార్థులకు ఇద్దరు, బీఈడీ 2వ సెమిస్టర్ పరీక్షకు 30 మంది విద్యార్థులకు ముగ్గురు, 3వ సెమిస్టర్ పరీక్షకు 39 మందికి నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు.

గురుకుల ప్రాంతీయ సమన్వయాధికారిగా అలివేలు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారి (ఆర్‌సీవో)గా అలివేలు గురువారం నియామకయ్యారు. ఇంతకు ముందు ఆర్‌సీవోగా ఉన్న మేరీ యేసుపాదం కరీంనగర్ రీజియన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అలివేలు నిజామాబాద్ రీజియన్ పరిధిలోని గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లతో ధర్మారం(బి) గురుకుల కళాశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రవేశాల ఫలితాలు, ఆహారం, పరిశుభ్రత పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఆర్‌సీవో మేరీ యేసుపాదంను సన్మానించారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు శివరాం, సత్యనారాయణ, నళిని, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

26న ఐటీఐలో ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఈ నెల 26న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ గురువారం తెలిపారు. జిల్లా పరిధిలోనే ఎలక్ట్రీషియన్, మెకానికల్ మెంటనెన్స్, వెల్డర్ మెషిన్/ షిఫ్ట్ ఆపరేటర్, లతే మెషిన్ ఆపరేటర్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్, ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్ ఒకేషనల్, బీకాం డిగ్రీ ఉన్న వారు అర్హులన్నారు. 30 ఏండ్ల లోపు ఉన్న అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో శివాజీనగర్‌లో ఉన్న ఉపాధి కార్యాలయానికి ఉదయం 10 గంటల లోగా హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 6305743423, 9581768413, 9959456793 నంబర్లను సంప్రదించలన్నారు.

పోస్టల్‌స్టాంపుల సేకరణపై అవగాహన

నిజామాబాద్ సిటీ: తపాలా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహనతో పాటు రీజినల్ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా తపాలా శాఖ ఇన్‌చార్జి సీనియర్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులకు ఈ పోటీలను నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీన్ దయాళ్ స్పర్ష్ యోజన కింద నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు రూ. 6వేల స్కాలర్‌షిప్ ఉపకార వేతనం అందిస్తామని అన్నారు. సెప్టెంబర్ 12లోగా విద్యార్థులు తమ దరఖాస్తులను పోస్టాఫీసుల్లో అందించాలన్నారు.

మాగోడు పట్టదా..?

- పెండింగ్ వేతనాలు అందక వీవోఏల ఇబ్బందులు
- పూర్తిస్థాయి విధులు నిర్వహిస్తున్నా కనికరించని ప్రభుత్వం
- ఆందోళనలో వీవోఏలు

బాల్కొండ: మహిళా సమాఖ్యలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లు పెండింగ్ వేతనాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనవరి నుంచి నేటి వరకు వేతనాలు అందకపోవడంతో ఇళ్లు ఎలా గడిచేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మహిళా సమాఖ్యలకు రుణాలు ఇప్పించడంలో, రికవరీ చేయడంలో వీవోఏలదే ప్రధాన పాత్ర. ప్రారంభంలో బుక్ కీపర్లుగా ఉన్న వీరి విధులు ప్రస్తుతం మండల స్థాయి రికార్డులు చేసే స్థాయికి పెంచారు. కానీ వేతనాల పెంపుదలలో మాత్రం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జిల్లా వ్యాప్తంగా 805 మంది వీవోఏలు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి 25 నుంచి 30 సంఘాలు ఉంటాయి. వీరు ప్రతి సంవత్సరం లక్ష్యానికి అనుగుణంగా రుణాలు ఇప్పించడం, రుణాలను రికవరీ చేస్తుంటారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ. 3900ల వేతనాన్ని సెర్ప్ ద్వారా అందిస్తోంది. గతంలో పార్ట్ టైం సేవలుగా వినియోగించుకున్న ప్రభుత్వం క్రమంగా పూర్తిస్థాయిలో వినియోగించుకుంటోంది. దీంతో వీవోఏలు చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని కష్టంగా నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం పథకాల పంపిణీ, రాజకీయ నాయకుల సమావేశాలకు మహిళా సంఘాలను తరలించడంలో వీరి పాత్ర ఎంతో ఉంది.



ముప్కాల్‌లో సమావేశం నిర్వహిస్తున్న వీవోఏలు (ఫైల్)

చాలీచాలని వేతనాలు..

ప్రతి నెలా చాలీచాలని వేతనాలతో నెట్టుకువస్తున్నా.. అవి సకాలంలో అందక వీవోఏలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ. 15 వేలు చేయాలని డిమాండ్ చేస్తూ గత నెల మేలో వీవోఏలు 40 రోజుల పాటు నిరవధిక సమ్మెను నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం లక్ష్యాన్ని పూర్తి చేస్తే ఇంటెన్సివ్ కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి వీవోఏల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏడు నెలలుగా వేతనాలు రాలేదు



ఏడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. ఇచ్చేది తక్కువ జీతమైనా పని చేస్తున్నాం. అవి కూడా సరిగా అందడం లేదు. ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–భాగ్య, వీవోఏ

డిమాండ్లను నెరవేర్చలేదు



గత మే నెలలో వీవోఏల డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెచేసినా ప్రభుత్వం స్పందించలేదు. అనేక యాప్‌లు తీసుకొచ్చి తమతో రోజంతా పని చేయిస్తున్నారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం తమతో వెట్టి చాకిరి చేయించుకుంటోంది.

–అరుణ, వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు

ప్రభుత్వం ఆదుకోవాలి..



వీవోఏలను ప్రభుత్వం ఆదుకోవాలి. నెలల తరబడి జీతాలు ఇవ్వకున్నా పని చేస్తున్నాం. ప్రభుత్వం తక్కువ వేతనం ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటోంది. అన్ని పనులకు మమ్మల్ని వినియోగించుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం తమ సేవలను గుర్తించాలి.

–కావ్య, వీవోఏ

ఎంఐఎం నేతలతో మతపెద్దల వాగ్వాదం

- శ్మశాన వాటిక రోడ్డు ప్రారంభోత్సవంలో గొడవ
- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

ఖలీల్‌వాడి: నగరంలోని ధర్మపురిహిల్స్ శ్మశాన వాటిక ప్రారంభోత్సవంలో ఎంఐఎం నేతలు, మత పెద్దల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గతంలో శ్మశాన వాటిక, రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి 3.20 ఎకరాల భూమిని కేటాయించింది. బుధవారం శ్మశాన వాటిక రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాకు మత పెద్దలు ఎంఐఎం కార్పొరేటర్ శ్మశాన వాటిక భూమి కబ్జా చేసి మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే శ్మశాన వాటికకు మరింత స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మత పెద్దలు ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, మేయర్ దండు నీతూకిరణ్‌ను మతపెద్దలు సన్మానించారు. అక్కడే ఉన్న డిప్యూటీ మేయర్‌ను సన్మానించాలని మత పెద్దలకు ఎమ్మెల్యే సూచించగా వారు నిరాకరించారు. దీంతో డిప్యూటీ మేయర్, మతపెద్దల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంఐఎం కార్పొరేటర్ శ్మశానవాటిక, మొరం తవ్వకాలు చేపడితే ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. దీంతో డిప్యూటీ మేయర్ కార్పొరేటర్‌ను ఎంఐఎం నుంచి తొలిగించామని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్‌తో పాటు మతపెద్దల మధ్య చోటుచేసుకున్న వాగ్వాద వీడియోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



డిప్యూటీ మేయర్‌తో ముస్లింల వాగ్వాదం

పెన్సిల్‌పై చంద్రయాన్–3



ఆర్మూర్‌టౌన్: చంద్రయాన్–3 యాత్ర విజయవంతమైన సందర్భంగా ఆర్మూర్ పట్టణానికి చెందిన లలిత్ చరణ్ తన కళా నైపుణ్యంతో పెన్సిల్‌ను చెక్కి చంద్రయాన్–3ను రూపొందించారు. సివిల్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూనే తనకున్న కలను మర్చిపోకుండా పెన్సిల్‌పై అందంగా చిత్రీకరించాడు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

మోపాల్: మండలంలోని అమ్రాద్‌తండాలో చెట్లు నరికివేస్తుండడంపై అటవీ అధికారులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై రాములు తండాకు చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.



తండావాసులతో మాట్లాడుతున్న పోలీసులు

రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా రాజేశ్వర్‌రావు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా రాజేశ్వర్‌రావు గురువారం హైదరాదాద్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ యాదవ్, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, బిషప్‌లు, పాస్టర్లు రాజేశ్వర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

28న జిల్లా స్థాయి పోటీలు

నిజామాబాద్‌నాగారం: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ గురువారం తెలిపారు. పోటీలను నెహ్రూ యువ కేంద్ర, జిల్లా యువజన, క్రీడల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 100, 200 మీటర్ల రన్నింగ్, జావలిన్ త్రో, హాకీ, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్‌లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లను 9100435419 వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

ఒకరిపై కేసు నమోదు



రామారెడ్డి: పోసానిపేట గ్రామంలో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న చిదుర ప్రకాశ్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని ఉప్పల్‌వాయి, పోసానిపేట గ్రామాల్లో కొందరు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై వెంట సివిల్ సప్లై డీటీ కిష్టయ్య, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో మేకను దొంగలించిన ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన మరుపల్లి ఎల్లయ్య తన పశువుల కొట్టం వద్ద తన మేకను ఉంచగా తాడ్వాయి మండలానికి చెందిన వేణు, అనిల్ బుధవారం రాత్రి సమయంలో బైకుపై దొంగిలించారు. జిల్లా కేంద్రంలో విక్రయిస్తుండగా కొనుగోలు చేసిన వ్యక్తికి అనుమానం వచ్చి వివరాలు సేకరించారు. దీంతో వారు దొంగిలించినట్లు ఒప్పుకోవడంతో స్థానికులు చితకబాదారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై గుండెల రాజు తెలిపారు. ఈ నెల 2న దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా కామారెడ్డికి చెందిన మామిండ్ల దేవేందర్, సదాశివనగర్ మండలం ధర్మరావుపేటకు చెందిన బుక సాధిక్‌లు మద్యం సేవించినట్లు ఎనలైజర్ ద్వారా గుర్తించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి గురువారం తెలిపారు. 2023 విద్యా సంవత్సరానికి మైనారిటీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బుద్ధిస్టు, పార్సీలు) సీఎం విదేశీ విద్యాపథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీలో 60 శాతం మార్కులు ఉండి పీహెచ్‌డీ చే యాలనుకునే వారు అర్హులన్నారు. ఈ పథకం ద్వా రా లబ్ధి పొందే విద్యార్థులు వసంత సీజన్ 2023 (జనవరి నుంచి జూలై) వరకు ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 21 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నూతన ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శశికళ గురువారం తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రెన్యువల్, నూతన ఉపకార వేతనాల కోసం డిసెంబర్ 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు http:// telanganaepass. cgg. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి ఇద్దరి దరఖాస్తు



ఆర్మూర్: కాంగ్రెస్ ఆర్మూర్ అభ్యర్థిత్వానికి అవకాశం కల్పించాలని కోరుతూ టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేశ్, నిజాంసాగర్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ ఎల్ల సాయిరెడ్డి గాంధీ భవన్‌లో పార్టీ ఇన్‌చార్జికి గురువారం దరఖాస్తు చేశారు. వారి వెంట నాయకులు రవికాంత్‌రెడ్డి, దేగాం ప్రమోద్, శ్రీనివాస్‌రెడ్డి, విట్టం జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- రెండు కిడ్నీలు ఫెయిలై ఆస్పత్రిపాలైన యువకుడు
- కిడ్నీ మార్పిడి చేయాలంటున్న వైద్యులు

లింగంపేట: లింగంపేట మండలం జల్దిపల్లి గ్రామానికి చెందిన అల్లం రవి(25)కి రెండు కిడ్నీలు చెడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన అల్లం అంజయ్యకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు రవి ఉన్నారు. ఈ మధ్యనే పెద్ద కూతురు మృతి చెందింది. అంజయ్య దివ్యాంగుడు. అతని ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేదు. తమను ఆదుకోవాల్సిన వయసులో కుమారుడు మంచాన పడడంతో తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే అప్పు చేసి రూ.ఐదు లక్షలు వైద్యానికి ఖర్చు చేశారు. ప్రస్తుతం రవి స్నేహితుల ఆర్థిక సహకారంతో ఎల్లారెడ్డి ఆస్పత్రిలో వారానికి రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయిస్తున్నారు. రెండు కిడ్నీలు ఫెయిల్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కిడ్నీలు మార్పిడి కో సం ఆపరేషన్ తప్పనిసరి అంటున్నారు. కిడ్నీల మార్పిడి కోసం దాతల ఆపన్న హస్తం అందించాలని రవి తండ్రి కోరుతున్నాడు.



చికిత్స పొందుతున్న రవి



అల్లం రవి

దాతలు సంప్రదించాల్సిన వివరాలు..

పేరు : అల్లం అంజయ్య
అకౌంట్ నంబర్ : 267410100030752
యూనియన్ బ్యాంకు, ఎల్లారెడ్డి బ్రాంచ్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : యుబీఐఎన్0826740
ఫోన్ పే, గుగూల్ పే నంబర్:
9398397769 (అల్లం కిష్టవ్వ)

విద్యార్థుల నైపుణ్యానికి పోస్టాఫీస్ ఫిలాటలీ దోహదం

నిజామాబాద్ సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు కేంద్ర తపాలా శాఖ పోస్టాఫీస్ ఫిలాటలీ ఖాతాను ప్రారంభించింది. ఈ ఖాతాతో విద్యార్థుల్లో నైపుణ్యం, నాలెడ్జ్ పెంచేందుకు ఎంతో దోహదపడనుంది. తపాలా శాఖకు సంబంధించి స్టాంప్‌ల సేకరణ చేసే అలవాటు ఉన్న పిల్లలతో పాటు, అలవాటు లేని పిల్లలకు ఫిలాటలీ ఖాతా తెరిపించి వారిలో ప్రతిభా పాఠాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటోంది.

ఫిలాటలీ ఖాతా అంటే ....

ఫిలాటలీ ఖాతాను రూ. 200తో పోస్టాఫీస్‌లో తెరువాలి. ఖాతా తెరిచిన విద్యార్థికి వెంటనే రూ.150ల విలువ గల స్టంప్‌లు ఇస్తారు. మిగిలిన రూ. 50 ఖాతాలో ఉంటాయి. ఈ ఖాతాలో మళ్లీ డబ్బులు జమ చేస్తే పోస్టాఫీస్‌కు కొత్తగా వచ్చే స్టాంప్‌లను ఆ విద్యార్థి ఇంటికి పోస్ట్ ద్వారా పంపుతారు. స్టాంప్‌లపై ఉండే మహనీయుల బొమ్మలు, స్టాంప్‌లపై ఉన్న చిత్రాలకు సంబంధించిన చరిత్ర స్టాంప్‌ల వెనుకాల ఉంటుంది. ఈ చరిత్ర గురించి తెలుసుకోవడమే ఫిలాటలీ ఉద్దేశం.

దీన్ దయాళ్ స్పర్ష్ కింద స్కాలర్ షిప్‌లు..

ఫిలాటలీ ఖాతా ఉన్న విద్యార్థులకు దీన్ దయాళ్ స్పర్ష్ యోజన కింద నిర్వహించే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే ఫిలాటలీ ఖాత తెరిచే అవకాశం ఉంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆ సంవత్సరం దీన్ దయాళ్ స్పర్ష్ యోజన కింద రూ. 6వేలు స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు.

దరఖాస్తు ఎలా..

విద్యార్థులు తమకు దగ్గరలోని పోస్టాఫీసుల్లో దరఖాస్తుల ఫారాలను నింపి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 12 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 24న పరీక్ష ఉంటుంది. మొత్తం అయిదు సబెక్టులకు 50 మార్కులు. కరెంట్ అఫైర్స్‌కి 5 మార్కులు, లోకల్ ఫిలాటలీకి 10, హిస్టరీకి 5, జాతీయ ఫిలాటలీకి 15, జియోగ్రఫీకి 5, సైన్స్‌కు 5, స్పోర్ట్స్, కల్చరల్‌కు 5 మార్కులు ఉంటాయి.

రాజ్యమేలుతున్న అగ్రకులాలు

- బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సిండికేట్ పార్టీలే
- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రంలో సమస్త అధికారం అగ్రకులాలే రాజ్యమేలుతున్నాయని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అగ్రకుల బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సిండికేట్ పార్టీలేనని, రాజకీయాలు అగ్రకులాల కోసమేనని అన్నారు. తెలంగాణలో నిజామాబాద్ జిల్లా ఒక రాజమండ్రి లాంటిదని అన్నారు. ఈ జిల్లా భూమి రాజకీయం సంపదలో ఇక్కడి బీసీ, ఎస్సీ, ఎస్టీలు లేరన్నారు. ఇక్కడి లక్షల ఎకరాల భూమి కమ్మ, రెడ్డి, వెలమల చేతుల్లో ఉందని అన్నారు. ఈ అగ్రకులాలు 93శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యంలో చోటు లేకుండా అణిచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేవారు. కార్యక్రమానికి ముందు స్థానిక మహిళలు బోనాలతో విశారదన్ మహరాజ్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరీశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సుమన్ మహరాజ్, మైపాల్, ప్రేమ్, ఆంజనేయులు, అడ్వకేట్ శ్రీనివాస్ గౌడ్, సునంద, సుకన్య, సంధ్య, పడిగ రాజు పాల్గొన్నారు.



విశారదన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

అడవుల సంరక్షణపై సదస్సు

ధర్పల్లి: అడవులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా సంరక్షించాలని ఫారెస్ట్ అధికారులు అన్నారు. మండలంలోని నడిమి తండాలో కొట్టాలపల్లి, హొన్నాజిపేట్ ఫారెస్ట్ అధికారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోడు పట్టాలు వచ్చిన వారు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. అడవుల్లోని చెట్లను నరికితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సదస్సులో అధికారులు రాజేశ్వర్, సురేందర్, శ్రీకాంత్, శిరీష, తండావాసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జోరుగా ఇసుక అక్రమ రవాణా



మోర్తాడ్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మొండివాగు, పెద్దవాగుల నుంచి ఇసుక తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

మోర్తాడ్: మండల కేంద్రంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మొండివాగు, పెద్దవాగుల నుంచి దళారులు ఎలాంటి అనుమతులు లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు వీరికి అడ్డు చెప్పకపోవడంతో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు, ఆరు కాయలు అనే విధంగా కొనసాగుతోంది. ప్రతి రోజు నిజామాబాద్, ఆర్మూర్ కేంద్రాలకు తరలిస్తూ ఖాళీ ప్రాంతాల్లో ఇసుకను డంప్ చేస్తున్నారు. ఇంతలా వీరి వ్యాపారం కొనసాగడానికి దళారులు అధికారులకు అందిస్తున్న ముడుపులే అని చెప్పొచ్చు. వీరి అక్రమ వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇకనైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సెప్టిక్ ట్యాంక్ వాహనాల సీజ్

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకొని నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ గురువారం తెలిపారు. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ చేస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌చార్జి పర్వేజ్, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ అబ్దుల్ ముమీన్, జవాన్ దుర్గాప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



వాహనాలను సీజ్ చేస్తున్న అధికారులు